న్యూస్ ఇండియా

తెలుగు జాతీయ దినపత్రిక

www.newsindiatelugu.com

రిపోర్టర్లు కావలెను

ఐదేళ్లుగా తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న న్యూస్ ఇండియా తెలుగు దినపత్రికకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఎలాంటి యాడ్స్ టార్గెట్ లేవు.

ఫోన్ నెం. 8125551235

హైదరబాద్ | సంపుటి : 4 సంచిక : 237 | 26-9-2025 శుక్రవారం | పేజీలు : 6 వెల : రూ. 3

తెలంగాణలో భారీ వర్షాలు..

కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్న ముఖ్యమంత్రి
- అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించాలని సూచన
- విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు సూచన

రానున్న రెండు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆయన కీలక సూచనలు జారీ చేశారు. కలెక్టర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, అలాగే ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాగా, ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

నేడు 15 జిల్లాలకు అతి భారీ వర్ష సూచన

బాసరలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనున్న నేపథ్యంలో రాష్ట్రంలో 15 జిల్లాలకు వాతావరణశాఖ అతి భారీ వర్ష సూచన చేసింది. శుక్రవారం ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 సెం.మీ. మధ్య వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపింది. ఈ మేరకు నిర్మల్, నిజామాబాద్,

వివరాలు 2లో..

రష్యాతో మరింత పటిష్ట బంధం

- కాల పరీక్షకు నిలిచి ముందుకే సాగుతాం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- దేశ స్వయం సమృద్ధికి పిలుపు

వివరాలు 2లో..

సర్కారు చేతికి మెట్రో రైలు

- కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య చర్చల్లో అంగీకారం
- బ్యాంకుల నుంచి ఆ సంస్థ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వానిదే
- మరో రూ.2 వేల కోట్లు ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం

హైదరాబాద్ మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రభుత్వం చేతిలోకి రానుంది. మెట్రో రైలును కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య గురువారం జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. గత కొన్ని రోజులుగా పలు ప్రత్యామ్నాయాలపై చర్చలు జరగగా... గురువారం జరిగిన చర్చల్లో తుది నిర్ణయానికి వచ్చారు. మెట్రో రైలు కోసం బ్యాంకుల నుంచి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మరో రూ.2 వేల కోట్లను ఎల్ అండ్ టీకి ప్రభుత్వం ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో ఇది కీలకంగా మారనుంది. ఈ నిర్ణయం అమలుకు తదుపరి కార్యాచరణ ప్రారంభిస్తున్నామని, ఇది పూర్తయితే దేశంలో ఉన్న 23 మెట్రోలలో ప్రైవేటు రంగం చేతిలో ఉన్న ఒకే ఒక మెట్రో కూడా ప్రభుత్వం చేతికొచ్చినట్లు అవుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

వివరాలు 2లో..

ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు

- రాష్ట్రంలో కొత్త మద్యం విధానం ఖరారు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- అక్టోబరు 23న లక్కీడ్రాలో దుకాణదారుల ఎంపిక
- 2,620 దుకాణాల్లో గౌడ, ఎస్సీ, ఎస్టీలకు 786 కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. 2025-27 లైసెన్సు కాలానికి 2,620 మద్యం దుకాణాల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో మాదిరిగానే 2011 జానాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజుల్ని ఖరారు చేస్తూ నోటిఫికేషన్ వెల్లడించింది. ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు(రెండేళ్లపాటు) ఈ విధానం అమల్లో ఉంటుంది. కొత్త దుకాణాల లైసెన్సులకు ఆయా జిల్లాలవారీగా దరఖాస్తులను శుక్రవారం నుంచి స్వీకరించనుంది. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుంను ఖరారు చేసింది. క్రితంసారి ఇది రూ.2 లక్షలుగా ఉండగా రూ.లక్ష పెంచింది. ఒక వ్యక్తి రూ.3 లక్షల చొప్పున చెల్లించి ఎన్ని దరఖాస్తులైనా

వివరాలు 2లో..

తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు

- తిరుమలలో రూ.102 కోట్లతో నిర్మించిన వేంకటాద్రి నిలయం ప్రారంభం
- ఒకేసారి 4 వేల మంది భక్తులకు ఉచిత వసతి కల్పించేలా నిర్మాణం
- టెక్నాలజీతో క్యూలైన్ల నిర్వహణకు సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- గంటకు 5500 మందికి దర్శనం కల్పించాలని అధికారులకు సీఎం ఆదేశం
- ప్రసాదం తయారీలో నాణ్యత పెంచేందుకు ఏఐ ఆధారిత యంత్రాల వినియోగం

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ శుభవార్త అందించింది. సామాన్య భక్తుల వసతి కష్టాలను తీర్చేందుకు, దర్శన సమయాన్ని తగ్గించేందుకు వీలుగా చేపట్టిన రెండు కీలక ప్రాజెక్టులు గురువారం ప్రారంభమయ్యాయి. రూ.102 కోట్ల వ్యయంతో నిర్మించిన బృహత్తర వసతి

వివరాలు 2లో..

కేటీఆర్ అరెస్టు ఖాయం

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ అరెస్టు ఖాయమన్న పీసీసీ చీఫ్
- ఫోన్ ట్యాపింగ్ చేసి బీఆర్ఎస్ నేతలు గెలిచారని ఆరోపణ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపుపై పూర్తి ధీమా

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టు కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన, పలు కీలక రాజకీయ అంశాలపై స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో

వివరాలు 2లో..

హర్యానాలో ప్రాంతీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న కవిత

- ప్రాంతీయ పార్టీలకే తమ ప్రాంతాలపై ప్రేమ ఉంటుందన్న కవిత
- రాబోయే రోజుల్లో ఇక్కడ ఐఎన్ఎల్‌డీ అధికారంలోకి రాబోతుందన్న కవిత
- రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వాలని వేదిక పైనుంచి చౌతాలకు సూచన

వివరాలు 2లో..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హర్యా నాలో అక్కడి ప్రాంతీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డీ) పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ఉప ప్రధాని చౌదరి దేవీలాల్ 112వ జయంతి

ఈడీ విచారణకు హాజరైన నటుడు జగపతి బాబు.. నాలుగు గంటలు ప్రశ్నించిన అధికారులు

సాహితీ ఇన్ ఫ్రా కేసులో నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. గురువారం (సెప్టెంబర్ 25) మధ్యాహ్నం ఈడీ ఆఫీసులో ఆయనను అధికారులు నాలుగు గంటలపాటు విచారించారు. సాహితీ ఇన్ ఫ్రా తరపున హీరో జగపతిబాబు పలు ప్రకటనల్లో నటించారు. ఈ క్రమంలో జగపతిబాబు, సాహితీ మధ్య ఆర్థిక లావాదేవీలుపై అధికారులు ప్రశ్నించారు.

వివరాలు 2లో..

రష్యాతో యుద్ధం ముగిశాక పదవిని వదిలేస్తా.. నా లక్ష్యం అదే

- అధ్యక్ష పదవికి పోటీ చేయడం తన లక్ష్యం కాదన్న జెలెన్‌స్కీ
- యుద్ధాన్ని ముగించడమే తన లక్ష్యమని స్పష్టీకరణ
- ఎవరు బతకాలో ఆయుధాలు నిర్ణయిస్తున్నాయని ఆందోళన

వివరాలు 2లో..

తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు

సముదాయం 'వేంకటాద్రి నిలయం' (పీఏసీ-5), క్యూలైన్ల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన అత్యాధునిక 'సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీ) లను భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

ఒకేసారి 4 వేల మందికి ఉచిత బస

ముందస్తు రిజర్వేషన్ లేకుండా తిరుమలకు చేరుకునే యాత్రికుల కోసం టీటీడీ ఈ నూతన వసతి సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. సుమారు 4 వేల మంది భక్తులు ఎలాంటి రుసుము చెల్లించకుండా బస చేసేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. ఈ భవనంలో 16 విశాలమైన డార్మిటరీలు, 2400 లాకర్లు, 24 గంటల వేడినీటి సదుపాయం వంటి సౌకర్యాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఒకేసారి 80 మంది తలనీలాలు సమర్పించేందుకు వీలుగా కల్యాణ కట్ట, 1400 మంది భోజనం చేసేందుకు రెండు భారీ డైనింగ్ హాళ్లను కూడా ఏర్పాటు చేశారు. వసతి సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి భవనంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బుకింగ్ కౌంటర్‌కు వెళ్లి, అక్కడి విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఓ భక్తురాలికి తొలి వసతి బుకింగ్ టోకెన్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా అందించారు. ప్రాంగణంలోని వ్యర్థాల సేకరణ యంత్రాన్ని, పోటులో ప్రసాదం నాణ్యత పెంచేందుకు ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సార్టింగ్ యంత్రాలను కూడా వారు ప్రారంభించారు.

టెక్నాలజీతో సులభతర దర్శనం

భక్తుల రద్దీని, క్యూలైన్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రస్తుతం గంటకు 4500 మంది భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని అధికారులు వివరించగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీల సాయంతో ఆ సంఖ్యను గంటకు 5500కు పెంచాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలిపిరి వద్దే నిషేధిత వస్తువులను గుర్తించడం, రద్దీకి అనుగుణంగా హీట్ మ్యాపులు రూపొందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుమల గిరులను 90 శాతానికి పైగా పచ్చదనంతో నింపాలని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే భక్తుల కోసం ఆధ్యాత్మిక వీడియోలు ప్రదర్శించాలని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా తిరుమల కొండపై భద్రత, పారిశుధ్యం, భక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు చేతికి మెట్రో రైలు

రెండో దశకు అడ్డంకిగా మారకూడదని...

వచ్చే మూడేళ్లలో మెట్రో రైలు రెండో దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని... కేంద్రానికి డీపీఆర్ పంపింది. అయితే మొదటి దశ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్నందున ఆ సంస్థతో అవగాహనకు రావాలని కేంద్రం సూచించడంతో పాటు పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఒప్పందం చేసుకోవడానికి ఎల్ అండ్ టీ అంగీకరించకపోవడంతో... రెండో దశకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మొదటి దశను ప్రభుత్వమే తీసుకోవాలని నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అవి ఓ కొలిక్కి వచ్చిన తరువాత గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్, సంస్థ సీఎండీ సలహాదారు డి.కె.సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ కె.వి.బి.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పట్టణ రవాణా ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు. మొదటి, రెండో దశ కలిపి నిర్వహణ తదితర అంశాలపై చర్చించిన తరువాత మొదటి దశ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేయడానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీనికి ఎల్ అండ్ టీ కూడా అంగీకారం తెలిపింది.

రెండో దశలో ఈక్విటీ భాగస్వామిగా ఉండేందుకు ఎల్ అండ్ టీ నిరాకరణ

సమావేశం అనంతరం ప్రభుత్వం, మెట్రో రైలు గ్రూపు నుంచి ఓ ప్రకటన విడుదలైంది. దీని ప్రకారం.. హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పెరుగుతున్న ప్రజా రవాణా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని రెండో దశ ఏ, బీ కింద ఎనిమిది లైన్లతో మొత్తం 163 కి.మీ. దూరం అదనపు మెట్రో నిర్మాణానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పలు దఫాలుగా సమీక్షించింది. మొదటి దశ ప్రైవేటు చేతిలో ఉండగా, రెండో దశ ప్రభుత్వం చేపడుతుందని... రెండింటినీ కలిసి సమీకృత నిర్వహణకు ఒప్పందానికి (డెఫినెటివ్ అగ్రిమెంట్) రావాలని కేంద్రం సూచించింది. ఇది జరిగితేనే తదుపరి ప్రక్రియను ప్రాసెస్ చేయగలమని పేర్కొంది. దీంతోపాటు రెండో దశలో కేంద్ర ప్రభుత్వం తరఫున జాయింట్ వెంచర్‌గా పాల్గొనాలని ఎల్ అండ్ టీని కేంద్రం కోరింది. అయితే రెండో దశలో భాగస్వామిగా ఉండటానికి గానీ, మొదటి రెండు దశలు కలిపి నిర్వహించడానికి అంగీకారం తెలుపుతూ ఒప్పందంపై సంతకం చేయడానికి గానీ ఎల్ అండ్ టీ అంగీకరించలేదు. మెట్రో రైలులో తమ వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి లేదా కేంద్రానికి విక్రయించడానికి ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో 2014 నవంబరు నుంచి నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సీనియర్ అధికారులతో కలిసి ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్, సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో చర్చించారు. మెట్రో రైలు విస్తరణ రెండో దశలో ఈక్విటీ భాగస్వామిగా ఉండాలని సీఎం కోరగా... ఎల్ అండ్ టీ ఛైర్మన్ అంగీకరించలేదు. మొదటి, రెండో దశ సమీకృత నిర్వహణ ఒప్పందంపై సంతకం చేయాలని సీఎం కోరారు. ఇందులో ఆదాయం, నిర్వహణ వ్యయంలో ఎవరి వాటా ఎంత అన్నదానికి ప్రత్యేక మెకానిజం కూడా ఉంది. అయితే రెండు దశల మధ్య రైళ్ల నిర్వహణ, ఆదాయం, నిర్వహణ వ్యయం వాటాలపై ప్రత్యేక యంత్రాంగానికి మెకానిజం తదితర అంశాల్లో ఉన్న ఆందోళనల కారణంగా సంతకం చేయలేమని ఎల్ అండ్ టీ ఛైర్మన్ పేర్కొన్నారని ప్రకటనలో ప్రభుత్వం వివరించింది. కేంద్ర ప్రభుత్వం రెండో దశ మెట్రోను ప్రాసెస్ చేయడానికి వీలుగా ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ముందుకు తెచ్చారు. మొదటి దశలో తమకు ఉన్న వాటా మొత్తం విక్రయిస్తామని, దీనివల్ల మొదటి దశ మొత్తం ప్రభుత్వానికే చెందుతుందని పేర్కొన్నారు.

మరో రూ.5,900 కోట్లు చెల్లించాలన్న ఎల్ అండ్ టీ

తమ వాటా మొత్తం విక్రయిస్తామని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ప్రతిపాదించిన తరువాత ఆర్థికపరమైన అంశాలు, ఆస్తుల విలువ తదితరాలపై చర్చ జరిగింది. మెట్రో రైలుకు ఉన్న రూ.13 వేల కోట్ల అప్పును ప్రభుత్వం తీసుకొని, తమ ఈక్విటీ విలువగా రూ.5,900 కోట్లు చెల్లించాలని సుబ్రమణ్యన్ కోరారు. 2022 జులై 22న జరిగిన అనుబంధ కాన్సెన్సస్ అగ్రిమెంట్ ప్రకారం రూ.మూడు వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.900 కోట్లు మాత్రమే ఇచ్చారని, మరో రూ.2,100 కోట్లు చెల్లించాల్సి ఉందన్న అంశం చర్చకు వచ్చింది. విస్తృతంగా చర్చించిన తరువాత కేంద్ర ప్రభుత్వం నుంచి రెండో దశ ఆమోదం పొందడానికి వీలుగా రూ.13 వేల కోట్ల అప్పును ప్రభుత్వం తీసుకోవడంతోపాటు మెట్రో రైలులో ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.రెండు వేల కోట్లు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వం మొదటి దశ మెట్రో రైలును టేక్‌ఓవర్ చేయడానికి తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు.

రష్యాతో మరింత పటిష్ట బంధం

- మొదటి పేజీ తరువాయి

కాలపరీక్షకు నిలిచినా.. రష్యాతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో ముందుకే సాగుతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా రక్షణ బంధం కొనసాగుతోందని గుర్తు చేశారు. ఆత్మ నిర్భరత (స్వయం సమృద్ధి) సాధించేందుకు కృషి చేస్తున్నామని, భారత్ లాంటి దేశం ఏ ఒక్కరిపైనా ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని నొయిడాలో గురువారం యూపీ అంతర్జాతీయ ట్రేడ్ షో-2025 ప్రారంభమైంది. ఇందులో రష్యా అంతర్జాతీయ భాగస్వామిగా ఉంది. ఈ ట్రేడ్ షోలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. 'ఈసారి అంతర్జాతీయ ట్రేడ్ షో వాణిజ్య భాగస్వామిగా రష్యా ఉంది. అంటే దీనిద్వారా మనం కాల పరీక్షకు నిలిచినా బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలను కొంటున్న భారత్‌పై మరిన్ని ఆంక్షలకు సిద్ధమవుతున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తద్వారా ఆ దేశం హెచ్చరికలను భారత్ పట్టించుకోదనే సందేశాన్ని ఆయన ఇచ్చినట్లయింది.

'భారత సైన్యం స్వదేశీ ఆయుధ సంపత్తిని కోరుకుంటోంది. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. భారత్ స్వయం సమృద్ధిని సాధించాలి. ఇక్కడ వినియోగించే ప్రతి వస్తువూ ఇక్కడే తయారుకావాలి. త్వరలో ఏకే-203 తుపాకులను రష్యా సహకారంతో భారత్‌లోనే తయారు చేయబోతున్నాం. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటవుతోంది. పలు ఆయుధాలను దేశీయంగా తయారు చేస్తాం. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ ఇప్పటికే ప్రారంభమైంది' అని ప్రధాని వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు కొనసాగుతాయని, ప్రజలపై పన్నుల భారం మరింత తగ్గుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

టూత్ పేస్ట్ నుంచి ట్రాక్టర్ దాకా..

'2014కు కంటే ముందు రూ.1,000 చొక్కాపై 170 పన్ను పడేది. 2017లో జీఎస్టీ ప్రవేశపెట్టాక పన్ను రూ.50కి తగ్గింది. తాజాగా జీఎస్టీ సంస్కరణల తర్వాత పన్ను రూ.35కు తగ్గిపోయింది' అని ప్రధాని వివరించారు. 2014కు ముందు నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, షాంపూ, తలకు రాసే నూనె, షేవింగ్ క్రీమ్‌లపై రూ.100 ఖర్చు చేస్తే రూ.31 పన్నుగా చెల్లించాల్సి వచ్చేది. 2017లో జీఎస్టీ వచ్చాక ఆ పన్ను రూ.18కి తగ్గింది. తాజా జీఎస్టీ సంస్కరణలతో ఆ పన్ను రూ.5కు తగ్గిపోయింది.

జవహర్ నగర్ లో జవహర్ నగర్ కోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

న్యాయవాది కుర్ర పుణ్యరాజు, జవహర్ నగర్ కోర్టు సాధన సమితి

న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 25
(మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్)

తెలంగాణ రాష్ట్ర అవతరన అనంతరం పరిపాలన సౌలభ్యం కొరకు జిల్లాల మరియు మండలాల విస్తరణ జరిగిన విషయం మీ అందరికీ విదితమే. అందులో భాగంగా న్యాయ వ్యవస్థలో కుడా న్యాయస్థానాల విస్తరణ జరిగింది. ఎన్నో ఏళ్లుగా మన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ ని కూడా మన జవహర్ నగర్ లో ఒక కొత్త కోర్టుని ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు చీఫ్ జస్టిస్ కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. కానీ మేడ్చల్ లోని కొంతమంది న్యాయవాదులు వారి స్వలాభం కోసం జవహర్ నగర్ కు ప్రత్యేక కోర్టుని రాకుండా అడ్డుకున్నారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ప్రతి సంవత్సరం సుమారుగా 1500 నుండి 2000 వేల కేసులు రిజిస్టర్ అవుతాయి. ప్రతి కేసు కోర్టుకు వెళ్లాల్సిందే, ఆ కోర్టు జవహర్ నగర్ నుండి 35 నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.ఒక్క కేసులో 6 నుండి పదిమంది వరకు సాక్షులు ఉంటారు.ఆ సాక్షులను కోర్టుకు తీసుకు వెళ్ళవలసిన బాధ్యత పూర్తిగా మన పోలీసుల పైన మరియు ఫిర్యాదు దారుడు పైన ఉంటుంది.ఒక్కొక్కసారి కేసు ప్రొద్దున పిలిస్తే మళ్లీ సాయంత్రం పిలుస్తారు.పిలిచేంతవరకు ఆ సాక్షులు ఆ ఫిర్యాదుదారుడు అదే కోర్టు ప్రాంగణంలో ఉండవలసిన అవసరం ఉంటుంది.ఒక్కొక్కసారి సాక్షులు మేము వేచి ఉండలేము అని వెళ్ళిపోయే సందర్భాలు కోకోనలుగా ఉంటాయి.ఇలా అనేక చిన్న చిన్న విషయాలలో అటు పోలీసులకు గాని ఇటు సాక్షిదారులకు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు.అదేవిధంగా జవహర్ నగర్ వాసులు మేడ్చల్ కోర్టు కు వెళ్ళడానికి డైరెక్ట్ బస్సు సౌకర్యం లేదు, జవహర్ నగర్ నుండి 2, 3 బస్సులు మారవలసి వస్తుంది. మనకు కోర్టులో ఏ చిన్న పని ఉన్న అంత దూరం ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆ రోజు పూర్తిగా ఆ పని నిమిత్తం గడిచిపోతుంది.జవహరనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పడక ముందు ఇప్పుడున్న జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంత భాగం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేది మరియు కాప్రా, వంపుగూడ, సాకేత్ ప్రాంతాలు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధి లో ఉండేవి. అదేవిదంగా దమ్మాయిగూడ మరియు చుట్టు ప్రక్కల కాలనీలు కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేవి. మరియు వాటికీ సంబంధించిన కోర్టు పరిధి మల్కాజ్గిరి కోర్టు కు ఉండేది. ఆయా ప్రాంతాలవారికి అది కేవలం మూడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండేది,అది అందరికి సౌకర్యం గా ఉండేది.ఇలా ప్రజల అవసరాల మేరకు మరియు రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కోర్టుల పరది ఏర్పాటు చేశారు ఇంకా చేస్తున్నారు. అందులో భాగంగానే రేపు దసరా సెలవుల తరువాత ప్రారంభం కానున్న "ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్" ఈ కోర్టు పరిధిలోకి ఉప్పల్ పోలీస్ స్టేషన్, మేడిపల్లి పోలీస్ స్టేషన్, ఘట్కేసర్ పోలీస్ స్టేషన్, పోచారం పోలీస్ స్టేషన్, నాచారం పోలీస్ స్టేషన్ మరియు బోడుప్పల్ పోలీస్ స్టేషన్ లు వస్తాయి.ఈ యొక్క పోలీస్ స్టేషన్లో పరిధి ఇంతకుముందు రంగారెడ్డి మరియు మేడ్చల్- మల్కాజిగిరి కోర్టు కాంప్లెక్స్ లో పరిధిలో ఉండేవి ప్రత్యేక ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటు కొరకు అనేక సార్లు వినతి పత్రాలు ఇవ్వడం వలన ప్రత్యేక కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటు జరిగింది.

అదేవిధంగా "జవహర్ నగర్ కోర్టు కాంప్లెక్స్" జవహర్ నగర్ లో ఏర్పాటు చేయాలని లేదా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కి సంబంధించిన కేసులకు ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి ఆ కోర్టును కుషాయిగూడ న్యాయస్థానల ప్రాంగణం లోనికి మార్చాలని మల్కాజ్గిరి న్యాయవాదుల బార్ అసోసియేషన్ మరియు పోలీస్ శాఖ కూడా చాలా సార్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కి మరియు హైకోర్టు వారి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది,వారు కూడా సానుకూలంగా

స్పందించినప్పటికీ ఇప్పటి వరకు సమస్యకు పరిష్కారం లభించలేదు. జవహర్ నగర్ కు సంబంధించి వేలాది కేసులు మేడ్చల్ కోర్టులో పెండింగ్ ఉన్నవి.ఇట్టి విషయంలో జవహర్ నగర్ లోని మేధావులు, కాలనీ అసోసియేషన్లు, కాలనీల పెద్దలు, వివిధ రాజకీయ పార్టీలు మరియు నాయకులు అందరూ పెద్ద ఎత్తున ఈ సమస్యపై జిల్లా న్యాయమూర్తికి మరియు హైకోర్టు రిజిస్టార్ కు సమస్య తీవ్రతను వివరిస్తూ వినతి పత్రాలు అందజేసే ఈ మహా యజ్ఞంలో పాలుపంచుకోవాలని మరియు జవహర్ నగర్ కోర్టు కాంప్లెక్స్ సాధన సమితి లో భాగస్వాములై జవహర్ నగర్ లో న్యాయస్థానం ఏర్పాటు పాటుపడతారని ఆశిస్తున్నాను. ఈ ప్రాంత ప్రజల ప్రధాన సమస్య గా దీన్ని భావించి దీనిపైన ఒక మంచి ఆర్టికల్ %ద% స్టోరీ రాయవలసిందిగా విలేకరులను కోరుతున్నాను అని ఈ సందర్భంగా జవహర్ నగర్ కోర్టు సాధన సమితి న్యాయవాది కుర్ర పుణ్యరాజు తెలిపారు.

రష్యాతో యుద్ధం ముగిశాక పదవిని వదిలేస్తా.. నా లక్ష్యం అదే

రష్యాతో యుద్ధం ముగిసిన అనంతరం తాను పదవిని వదులుకుంటానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాతో యుద్ధాన్ని ముగించడమే తన ప్రధాన లక్ష్యమని, అధ్యక్ష పదవికి పోటీ చేయడం కాదని ఆయన స్పష్టం చేశారు.

వీలైతే ఎన్నికలు నిర్వహించాలని తన దేశ పార్లమెంటును కోరుతానని కూడా తెలిపారు. రష్యాతో జరుగుతున్న యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

ఎవరు బతకాలో ఆయుధాలు నిర్ణయిస్తున్నాయి

ఎవరు బతకాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచంలో మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధ పోటీ నెలకొందని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని ఆయన కోరారు. ఐక్యరాజ్యసమితితో సహా ఇతర బలహీన అంతర్జాతీయ సంస్థలు ఉక్రెయిన్, గాజా, సూడాన్‌లలో జరుగుతున్న యుద్ధాలను నిలువరించలేకపోయాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. రష్యా తమపై యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉందని ఆయన అన్నారు. పుతిన్ ఇప్పుడు యుద్ధాన్ని ఆపకపోతే అది మరింత విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా డ్రోన్లు యూరప్ అంతటా ఎగురుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

కేటీఆర్ అరెస్టు ఖాయం

విమర్శలు గుప్పించారు. "కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ ఫోన్ ట్యాపింగ్ చేసి గత ఎన్నికల్లో గెలిచారు" అని ఆయన ఆరోపించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గత విషయాలపైనా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం ప్రస్తుతం ఏఐసీసీ పరిధిలో ఉందని, ఈ విషయంపై అధిష్ఠానమే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. డీసీసీల ఏర్పాటుపై చర్చించేందుకు గురువారం మధ్యాహ్నం రాహుల్ గాంధీతో సమావేశం జరగనుందని వెల్లడించారు. ఈ భేటీకి ఏఐసీసీ కొత్తగా నియమించిన 22 మంది పరిశీలకులు కూడా హాజరవుతారని చెప్పారు. ఈ పరిశీలకుల బృందం అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేస్తుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

బతుకమ్మ కుంటకు హైడ్రా ఊపిరి

- మొదటి పేజీ తరువాయి

అక్కడ ఎక్స్‌కవేటర్లతో తవ్వగా మీటరు లోతులోనే నీరు ఉబికివచ్చింది. దాదాపు రూ.7.15 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టింది. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దింది. చిన్న పిల్లలు ఆడేందుకు ఆటస్థలం, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు తదితరాలు ఏర్పాటు చేసింది. చుట్టూ మెట్లతో కాంక్రీట్ గోడ కట్టింది. ప్రస్తుత వర్షాలకు కుంటలో నిండుగా నీరు చేరి జలకళ సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాలను అక్కడే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం కుంటను సీఎం జాతికి అంకితం చేయనున్నారు. తొలుత బతుకమ్మ కుంట కోసం యెడ్ల సుధాకర్‌రెడ్డి పోరాటం చేశారు. హైడ్రా చొరవతో జీహెచ్ఎంసీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో కుంటకు పునరుజ్జీవం పోశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.

నేడు 15 జిల్లాలకు అతి భారీ వర్ష సూచన

- మొదటి పేజీ తరువాయి

జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తిలకు 'ఆరెంజ్' హెచ్చరికలను జారీ చేసింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. నది నుంచి ఆలయానికి వెళ్లే మార్గం పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: సీఎం

వచ్చే రెండు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ నివేదికపై అన్ని శాఖలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. "అన్ని జిల్లాల కలెక్టర్లు పరిస్థితిని సమీక్షించాలి. అన్ని చెరువు కట్టలను పరిశీలించాలి. వరద నీరు నిలిచే రోడ్లను గుర్తించి.. ముందస్తుగా వాహనాలను నిలిపివేయాలి. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేపట్టాలి" అని సీఎం ఆదేశించారు.

ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు

- మొదటి పేజీ తరువాయి

చేయొచ్చు. ఈ రుసుం పూర్తిగా నాన్ రిఫండబుల్(తిరిగివ్వరు). దరఖాస్తులను నేరుగా జిల్లా ఎక్సైజ్ కార్యాలయం లేదా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేదా ఆబ్కారీభవన్‌లో అందజేయాలి. రిజిస్టర్ పోస్టు, మెయిల్ ద్వారా పంపే వాటిని పరిగణనలోకి తీసుకోబోమని ఆబ్కారీశాఖ స్పష్టం చేసింది.

3 సామాజికవర్గాలకు 30% రిజర్వేషన్

గతంలో మాదిరిగానే ఎస్సీ, ఎస్టీ, గౌడ సామాజికవర్గాల వ్యాపారులకు టెండర్లలో రిజర్వేషన్లు కల్పించారు. జిల్లా యూనిట్‌గా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించనున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలవారీగా గౌడ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాల్సిన దుకాణాలను డ్రా ద్వారా నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల్లో రిజర్వేషన్ కేటగిరీలోకి 786(30%) కేటాయించారు. ఇందులో గౌడ సామాజికవర్గానికి 393(15%), ఎస్సీలకు 262(10%), ఎస్టీలకు 131(5%) కేటాయించారు. కుల ధ్రువీకరణపత్రం లేకున్నా అండర్‌టేకింగ్ ఇస్తూ దరఖాస్తు సమర్పించొచ్చు. ఒకవేళ లక్కీడ్రాలో దుకాణం దక్కించుకుంటే నవంబరు 15లోగా కుల ధ్రువీకరణపత్రం సమర్పించాలి. లేదంటే లైసెన్సు రద్దు చేస్తారు. తొలివిడతగా చెల్లించిన ఇన్‌స్టాల్‌మెంట్ సొమ్ము కూడా జప్తవుతుంది.

ఆరు విడతల్లో చెల్లింపు

మద్యం దుకాణదారులు ఏటా ఆరు విడతల్లో లైసెన్సు రుసుంను సమంగా చెల్లించాల్సి ఉంటుంది.

వార్షిక లైసెన్సు రుసుంలో 25% మొత్తానికి 25 నెలలపాటు బ్యాంకు పూచీకత్తు ఇవ్వాలి.

దుకాణం టర్నోవర్ వార్షిక లైసెన్సు రుసుంకు 10 రెట్లు దాటిన అనంతరం విక్రయాలపై 10% షాప్ టర్నోవర్ ట్యాక్స్‌ను వసూలు చేస్తారు.

వ్యాపారులకు ఆర్డినరీ మద్యం విక్రయాలపై 27%, మీడియం, ప్రీమియం మద్యంపై 20%, బీర్లపై 20% మార్జిన్‌ను నిర్ణయించారు.

జీహెచ్ఎంసీకి అవతల 5 కి.మీ. పరిధిలోని దుకాణాలకూ జీహెచ్ఎంసీ లోపలి దుకాణాల లైసెన్సు రుసుమే వర్తిస్తుంది. ఇదే నియమం రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లకూ ఉంటుంది. అలాగే మున్సిపాలిటీ లేదా సెమీ అర్బన్ ఏరియాలకు అవతల 2 కి.మీ. పరిధిలోని వాటికి మున్సిపాలిటీల్లోని దుకాణాల మాదిరే రుసుం ఉంటుంది.

స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ గతంలో మాదిరిగానే ఏటా రూ.5 లక్షలుగా నిర్ణయించారు.

ఎప్పటిలానే దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచేందుకు అనుమతించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం ఒక గంట అదనంగా అంటే రాత్రి 11 గంటల వరకు అమ్మకాలు సాగించే వెసులుబాటు కల్పించింది.

మనస్థాపానికి గురై వ్యక్తి మృతి

న్యూస్ ఇండియా రిపోర్టర్ గొర్రె భరత్ గూడూరు :గూడూరు మండలంలోని కోబాల్ తండాకి చెందిన గుగులోతు మంగీలాల్ 15వ తారీకు రోజున భార్యాభర్తల మధ్య చిన్న గొడవ వలన తన భార్య తన పుట్టిల్లు అయిన లైన్ తండాకు వెళ్లగా తాను17వ తారీఖు ఉదయం 9 గంటలకు వెళ్లి తన భార్యని ఇంటికి రమ్మని అడగగా దానికి తాను పెద్ద మనుషుల మధ్య పంచాయతీ చేసిన తర్వాతనే వస్తాను అని చెప్పగా దీంతో మంగీలాల్ మనస్థాపం చెంది మరిమిట్ట దగ్గరలో పురుగుల మందు తాగగా వెంటనే మంగీలాల్ తమ్ముడు తల్లి కలిసి ప్రభుత్వ ఆసుపత్రి ఎంజీఎం కి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా గురువారం ఉదయం మరణించడం జరిగింది.ఇట్టి మృతి పై మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి గిరిధర్ రెడ్డి తెలిపారు

పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఘన నివాళులర్పించిన: భాజపా శ్రేణులు...



రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్ సెప్టెంబర్ 25, న్యూస్ ఇండియా ప్రతినిధి: భరతమాత ముద్దుబిడ్డ, ఏకాత్మ మానవవాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తిప్రదాత పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కార్యాలయం వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, మొక్కలు నాటి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా (అర్బన్) ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా ఎస్సి మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, డివిజన్ కార్యవర్గ సభ్యులు వస్పరి వెంకటేష్, సుజాత, సైదమ్మ, ఈటబోయిన నర్సింహా, రాములు యాదవ్, కొండల్ రెడ్డి, అరుణ్, బీజేవైఎం సీనియర్ నాయకులు ఎర్ర ప్రేమ్, భరత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి మాజీ ఎంపిపి సర్పంచ్

న్యూస్ ఇండియా రిపోర్టర్ గొర్రె భరత్ గూడూరు :గూడూరు మండల కేంద్రంలోని పొనుగోడు గ్రామానికి చెందిన బానోతు తరుణ్ అజ్మీర ప్రవీణ్ ధరావత బాల కృష్ణ రాములుతండ గ్రామానికి చెందిన గుగులోత్ లక్ష్మీ గూడూరు కు చెందిన దయ్యాల ఉపెందర్ లకు మొత్తం 1,45,000 రూపాయలు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి గూడూరు మాజీ ఎంపీపీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ వారితొపాటు మండల సినీయర్ నాయకులు కన్నెబోయిన వెంకన్న కోరే కుమార్ బాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెసరి శివ కందికట్ల బిక్షపతి మాజీ వార్డు సభ్యుడు హెచ్ శివ నూనావత్ శ్రీకాంత్ గళ్ళ చంటి బానోత్ హారి బానోత్ మోహన్ నాయక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

47వ డివిజన్ పరిధిలో దేవీ నవరాత్రులో భాగంగా దేవి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర యువజన నాయకులు డాక్టర్ శ్రీ తుమ్మల యుగంధర్

ఖమ్మం, సెప్టెంబర్ 25: న్యూస్ ఇండియా తెలుగు.ఖమ్మం 47వ డివిజన్ కాల్వఒడ్డు బొక్కల గడ్డ ప్రాంతంలో శ్రీ రేణుక యల్లమ్మ దుర్గాదేవీ శరన్నవరాత్రులు నాలుగో రోజు శ్రీ కాత్యాయనీ దేవి అలంకరణలో అమ్మవారు అలంకరించబడ్డారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీ తుమ్మల యుగంధర్ కి నిర్వాహకులు పూల బోక్కేతో ఆహ్వానం పలికి, డిజె సౌండ్, కోలాటాల నృత్యాలు, పూలతో ఘనంగా స్వాగతంతో అమ్మవారి మండపం వరకు తీసుకెళ్లారు. తోలుతూ కొబ్బరికాయ కొట్టి, హారతి తీసుకుని అమ్మవారిని తుమ్మల యుగంధర్ దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు శాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ పూజారి ఉప్పిసాయి,, మార్కెట్ చైర్మన్ శ్రీ యరగర్ల హనుమంతరావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు, విగ్రహం దాత నాళం సతీష్, దీపక్ చౌదరి, బాణాల లక్ష్మణ్, ఆశ్రిఫ్, పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు .

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగుల బతుకమ్మ సంబరాలు

ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి రాథోడ్

న్యూస్ ఇండియా తెలుగు సెప్టెంబర్ 25 (జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డి వీరాంజనేయులు)మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ప్రభుత్వ ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొర్రూరు మరియు ఏరియా హాస్పిటల్ సిబ్బంది మహిళా ఉద్యోగులు అందరు కలిసి బతుకమ్మ పండుగ సంబరాల శుభ సందర్భంగా హాస్పిటల్ ఆవరణలో ఆట పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు .

ముఖ్య అతిథిగా విచ్చేసిన మన డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ పూలనే పూజించే పండగ అని ఇది మన తెలంగాణాలోనె జరిగే అతి గొప్ప పండగ అని ఇది మన ఆడపడుచులు సంతోషంగా జరుపుకొనె పండుగ అని కొనియాడారు. డాక్టర్ చింతా రమేష్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ మహబూబాబాద్ తెలంగాణా ఆడపడుచులు బతుకమ్మ పండుగ ఎప్పుడూ వస్తుందా అని ఎదురు చూస్తూ ఉ%శీ%టారని అన్నారు.పువ్వు లనే పూజించే పండగ అని ఆడపడుచులు అందరూ సంతోషంగా జరుపు కుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్ రెడ్డి డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ తొర్రూరు, డాక్టర్ నాగేస్వర్ రావు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సారంగం, ప్రోగ్రామర్ ఆఫీసర్లు, మరియు ఆయుఃశు డాక్టర్ కిరణ్, రఘునాథ్ ఏ ఒ, భాస్కర్ యు డి సి, శ్రీధర్ గార్లు పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని ఇది అన్ని వర్గాల మహిళలు కలిసి ఆడుకునే అతి పెద్ద పండుగ అని అన్నారు.

అనంతరం డాక్టర్ నందన దేవి మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ బతుకమ్మ పండగలో మా మహిళా ఉద్యోగులు అందరూ పాల్గొనడం వారి అందరి తో కలిసి బతుకమ్మ ఆటలు పాటలో పాల్గొనడం నాకూ ఎంతో సంతోషంగా కలిగిందని అన్నారు.

ఇందులో డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ మీరాజ్ , డాక్టర్ నందన,డాక్టర్ మానస,

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కుసుమ విద్యాసాగర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి మరియు ఏరియా హాస్పిటల్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సూపర్ వైజర్లు, పి హెచ్ యన్ సుందరి, కమల, మేరీ, మంతీయా, ఏ యన్ యం లు , హెల్త్ అసిస్టెంట్లు అయిన సిరి శ్రీనివాస్, సాయి కృష్ణ , సత్య నారాయణ, హేమ ఆశా లు మరియు సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా పాల్గొన్నా నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి.....

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 25(న్యూస్ ఇండియా ప్రతినిధి)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 120 గజాల కాలనీ దుల్లపల్లిలో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో బస్తి వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా రోడ్డు కొరకు రూ.12,00,000 లక్షల రూపాయలు మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నా నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం బస్తి వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్ , పాక్స్ చైర్మన్ గారిశే రాజు , పాక్స్ డైరెక్టర్ దప్పు నరేంద్ర ,ప్రసాద్, నాగరాజ్ యాదవ్, మోహన్ రావు, శివాజీ, పూర్ణచందర్ రావు, గోపాల్ రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు

న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 25. అడ్డగూడూర్ మండల రిపోర్టర్.అడ్డగూడూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్నీ వైద్య అధికారి డాక్టర్ భార్గవి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, కంటి పరీక్ష షుగర్, హీమోగ్లోబిన్, కంటి పరీక్షలు నిర్వహించి, వారికి మందులు అందించారు. గర్భిణీ స్త్రీలు, తల్లులు, చిన్నారులకు అవసరమైన వైద్య సూచనలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ సృజన, గైనకాలజిస్ట్ డాక్టర్ సుప్రియ, పీడియాట్రిషన్ డాక్టర్ కవిత, కంటి స్పెషలిస్ట్ డాక్టర్ వాసుదేవ్ ప్రత్యేకంగా పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ భార్గవి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళే ప్రతి కుటుంబానికి,సమాజానికి మూలస్తంభం. ప్రతి ఒక్కరూ తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, మెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత ప్రత్తి సాగు లాభదాయకం

న్యూస్ ఇండియా:నర్సంపేట:అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయటం ద్వారా రైతులు అధిక దిగుబడులు పొంది అర్థికాభివృధి సాధించగలుగుతారని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. వరంగల్ జిల్లాలోని "టీఆర్ వికే"ఆధ్వర్యంలో,వ్యవసాయ కళాశాల విద్యార్థులు నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలో అధిక సాంద్రత ప్రత్తి సాగులో క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సాధారణ ప్రత్తి సాగు ద్వారా మొక్కల సంఖ్య 5 వేల నుండి 6 వేల వరకు ఉంటుందని,అధిక సాంద్రత ప్రత్తి సాగు చేసినప్పుడు మొక్కల సంఖ్య 20 వేల వరకు ఉంటుందన్నారు. సాధారణ ప్రత్తి సాగు ద్వారా 6 నుండి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని,అధిక సాంద్రత ప్రత్తి సాగులో 10 నుండి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అన్నారు.రైతు నరసింగం మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి అధిక సాంద్రత పద్ధతి ద్వారా ప్రత్తి సాగు చేస్తున్నారన్నారు.మొక్కల సంఖ్య పెరిగినప్పటికీ,మొక్కలు ఎత్తు ఎక్కువగా పెరగకుండా మేపి క్వార్డ్ క్లోరైడ్(ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్) మందును పిచికారి చేశానని వివరించారు.అధిక సాంద్రత పద్ధతి ప్రత్తి సాగు ద్వారా గత ఏడాది ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు.

జర్నలిస్ట్ రమేష్ గౌడ్ ను సన్మానించిన గౌడ సంఘాల నాయకులు

న్యూస్ ఇండియా:నర్సంపేట:నర్సంపేట పట్టణంలో తెలంగాణా వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జె ఎఫ్) జాతీయ కౌన్సిల్ మెంబెర్ గా ఎన్నికైన అనంతుల రమేష్ గౌడ్ ను పట్టణ గౌడ సంఘం, గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ, గౌడ జర్నలిస్ట్ సోదరులు గురువారం షాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రమేష్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులు, జర్నలిస్ట్ ల సమస్యల సాధన కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ గౌడ సంఘ నూతన అధ్యక్ష కార్యదర్శి కోల వెంకటేశ్వర్లు గౌడ్, మద్దెల శ్రీనివాస్ గౌడ్,ఉపాధ్యక్షులు గాదగోని సాంబయ్య గౌడ్,ఆర్థిక కార్యదర్శులు గిరగాని కిరణ్ గౌడ్, నాతి సదానందం గౌడ్,కమిటీ సభ్యులు తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్ వేముల కృష్ణ గౌడ్,నాగెల్లి ప్రమోద్ గౌడ్, మొగలగాని సురేష్ గౌడ్, సుక్క రవి గౌడ్, గిరగాని రమేష్ గౌడ్, సంఘ పెద్ద మనుషులు కొయ్యడి కిరణ్ గౌడ్, నాగెల్లి సారంగం గౌడ్,గాదెగోని సాంబయ్య గౌడ్, తాబేటి లక్ష్మణ్, గౌడ్ ఏకాంతం గౌడ్,మల్లేష్ గౌడ్,కుమారస్వామి గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్, కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్,జిల్లా కార్యదర్శి శీలం వీరన్న గౌడ్, ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్ గౌడ్, జునూరు నరేష్ గౌడ్,

గంధసిరి సాం బ్రాజ్యం గౌడ్, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల పులిపాటి

- సామాజిక సేవకుడికి "జీ తెలుగు" అచీవర్స్ అవార్డ్
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందజేత

న్యూస్ ఇండియా తెలుగు: సెప్టెంబర్ 25. –ప్రతి కదలిక నిస్వార్థంతో కూడినదే అయితే గుర్తింపు దానంతట అదే వస్తుంది. పది మందికి సాయపడే మనసే ఉంటే ప్రశంశలు వాన జల్లులా కురుస్తాయి. సమాజంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటూ విశిష్ట సేవలతో నాటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా "వాగ్దేవి" విశిష్ట సేవా పురస్కారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా "ఉత్తమ విద్యా సంస్థల అవార్డు"ను అందుకున్న ప్రఖ్యాత వ్యక్తి డాక్టర్ పులిపాటి ప్రసాద్ అమ్ముల పొదిలోకి మరో పురస్కారం వచ్చి చేరింది. సేవే శ్వాసగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పులిపాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ న్యూస్ ఛానల్ "జీ తెలుగు" అచీవర్స్ అవార్డును బహుకరించింది. హైద్రాబాద్ నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ కన్వెన్షన్ హాల్ లో బుధవారం సాయంత్రం "జీ తెలుగు" యాజమాన్యం ఈ పురస్కారాన్ని పులిపాటికి ప్రదానం చేసింది. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, సినీ దర్శకుడు హరి శంకర్, ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ నాగేశ్వర రెడ్డి, జీ తెలుగు చీఫ్ ఎడిటర్ భరత్ కుమార్ లు "జీ తెలుగు అచీవర్స్" అవార్డును పులిపాటి ప్రసాద్ కు బహుకరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, సినీ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి, ప్లే బ్యాక్ సింగర్ మంగ్లీ, రికార్డ్ హోల్డింగ్ మౌంటెనీర్ కళావత్ పూర్ణ పాల్గొన్నారు.లి

సేవానిరతికి పురస్కారాలెన్నో.

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో డాక్టర్ పులిపాటి ప్రసాద్ తెగువ చూపి ప్రజలకు ఆపన్న హస్తం అందించారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో పాటు వందలాది మంది నిరుపేద ప్రజానీకానికి 10 లక్షలను వెచ్చించి నిత్యావసర వస్తువులు, మందులను పంపిణీ చేశారు. అలాగే తమ నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల్లో చదువుతున్న 72 మంది నిరుపేద పిల్లలకు వారి ఆర్థిక స్థితిని బట్టి 13 లక్షల మేర ఫీజులను తగ్గించడం, మినహాయించడం ద్వారా తల్లిదండ్రుల మన్ననలు పొందారు.

రాజకీయ అరంగేట్రం చేసిన తొలినాళ్లలో తెలుగుదేశం పార్టీలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్న పులిపాటికి కాంగ్రెస్ సర్కారు పదవి కట్టబెట్టడం సాధారణ విషయమేమీ కాదు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో రాష్ట్ర ప్రజల విజ్ఞప్తుల మేరకు మద్యపాన నిషేధాన్ని అమలులోకి తేవాల్సి వచ్చింది. ఇలాంటి గురుతర బాధ్యతను మోసేందుకు వావిలాల గోపాలకృష్ణయ్యను రాష్ట్ర మద్యపాన నిషేధ కమిటీకి చైర్మన్ గా సర్కారు నియమించింది. శ్రీరామమూర్తిని రాష్ట్ర కన్వీనర్ గా ఎంపిక చేయగా ఖమ్మం జిల్లాలో ఈ గురుతర బాధ్యతను మోసే అవకాశం నాడు తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా ఉన్న పులిపాటి ప్రసాద్ కు దక్కింది. మద్యపాన నిషేధ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరించగా పులిపాటి కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టడం నాటి రాజకీయాల్లో సంచలనంగా మారింది.

నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో వినియోగదారుల భద్రతా మండలి రాష్ట్ర డైరెక్టర్గా పని చేసి అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఘనత పులిపాటికి దక్కింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఎన్టీఆర్ ఈ భద్రతా మండలికి చైర్మన్ గా వ్యవహరించగా నూనూగు మీసాల ప్రాయంలో పులిపాటి డైరెక్టర్ గా వ్యవహరించారు. శాసనసభ స్పీకర్ గా పని చేస్తున్న శ్రీపాదరావు యనమల రామకృష్ణుడుని జిల్లాకు రప్పించి వారి ద్వారా వినియోగదారుల సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించి ప్రతిపక్షాలను సైతం ముక్కున వేలేసునేలా చేసిన ఘనత పులిపాటి సొంతం. అప్పటి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా జడ్జిలను ఈ మహోన్నత కార్యంలో భాగస్వాములను చేసి ప్రజల్లో వస్తు కొనుగోళ్లు, వినియోగం పట్ల అవగాహన కార్యక్రమాలను ఉవ్వెత్తున నిర్వహించారు.

జన జాగృతి పేరిట ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం పులిపాటి చేసిన కృషికి అద్భుతమైన, అపారమైన గుర్తింపు లభించింది. పులిపాటి ప్రసాద్ చైర్మన్ గా వనజీవి రామయ్య కన్వీనర్ గా జన జాగృతి పరిరక్షణ కమిటీని నియమించగా నాడు జిల్లాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి రామయ్యతో మూడు దశాబ్దాల కిందటే కలిసి పని చేయడం ఆయన మరిచిపోలేని ఘట్టం. నాడు వనజీవితో కలిసి జిల్లా నలు మూలల్లో ఐదు లక్షల మొక్కలు నాటిన ఘనతకు గుర్తింపుగా "పర్యావరణ పరిరక్షణ విశిష్ట సేవా అవార్డు"ని నాటి ప్రభుత్వం పులిపాటికి బహుకరించింది. రాష్ట్ర గవర్నర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అఫీషియల్ అవార్డును అందుకోవడం చరిత్రాత్మకం.లి

పులిపాటి టిడిపిలో ఉన్నప్పటికీ ఆయన విద్యా సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం నాడు గొప్ప పురస్కారంతో గౌరవించడం విశేషం. జిల్లా కలెక్టర్ గా నాడు పని చేసిన శశిభూషణ్ కుమార్ చేతుల మీదుగా 2009లో రిపబ్లిక్ డే రోజున "ఉత్తమ ఎడ్యుకేషనలిస్ట్" అవార్డును పులిపాటి అందుకున్నారు. అలాగే 2019లో నాటి గవర్నర్ తమిళసై చేతుల మీదుగా హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో "మహాత్మా గాంధీ నేషనల్ అవార్డు"ను ప్రసాద్ దక్కించుకున్నారు. ఆవేదికపై బిజెపి ఎంపీ బంగారు లక్ష్మణ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు కూడా ఉన్నారు.

2006 సెప్టెంబర్లో నాటి కాంగ్రెస్ డైనమిక్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలోనే "ఉత్తమ విద్యా సంస్థల అవార్డు"ను పులిపాటికి బహుకరించడం సంచలనం రేపింది. తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి అవార్డును బహూకరించడం నిజంగా సంచలనమే మరి.

ఉత్తమ విద్యా సేవలకు గుర్తుగా 2008 మేలో నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా ఢిల్లీలో జాతీయ స్థాయి "వాగ్దేవి విద్యా సంస్థల పురస్కారాన్ని" పులిపాటి అందుకున్నారు.

ఎంపీ వద్దిరాజు ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం

ఖమ్మం, సెప్టెంబర్ 25: న్యూస్ ఇండియా తెలుగు – స్టాఫ్ రిపోర్టర్ సయ్యద్ షారుక్.రాష్ట్రంలో పాలన పూర్తిగా కుంటుపడిపోయిందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు గొప్పగా అమలు చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షానికి చెందిన వారిని బెదిరించడం,ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తూ "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఖమ్మంలోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసం ఆవరణలో గురువారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎంపీ రవిచంద్ర మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారాబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాలను పట్టుకు తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పూర్తిగా విస్మరించారన్నారు. యూరియా కోసం రైతన్నలు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తున్నదని,పింఛన్ల మొత్తాన్ని పెంచుతామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బహిరంగ సభ నుంచి ఇప్పటిదాకా ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు

స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు పెట్టే పరిస్థితి కనిపించడం లేదన్నారు.అన్ని వర్గాల ప్రజల బాగోగులు, శ్రేయస్సును ఎల్లప్పుడూ కాంక్షించే కేసీఆర్ తెలంగాణ తొలి శాసనసభ సమావేశాలల్లోనే మహిళలు, బీసీలకు చట్టసభల్లో 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ అమలు చేయాలని కోరుతూ తీర్మానించి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ బీసీలు, బడుగు బలహీన వర్గాలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి కలిగిన గొప్ప నాయకుడని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి చోట్ల కూడా విద్యుత్ కోతలు నిత్యకృత్యంగా మారాయని, కేసీఆర్ పాలనలో ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు, అజయ్ నేతృత్వంలో కార్యకర్తలు కార్యోన్ముఖులై ఖమ్మం నగరం చుట్టూరా ఉన్న గ్రామాలలో పార్టీని గెలిపించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఆ విధంగా మనమంతా మరింత సంఘటితమై ఈ ఉమ్మడి జిల్లాలోని అత్యధిక అసెంబ్లీ సీట్లను గెలిపించుకుని ఇతర పార్టీ నాయకుల ఆశలను వమ్ము చేసి కేసీఆర్ ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు. ఇటీవల అమెరికా పర్యటనను దిగ్విజయంగా పూర్తి చేసుకుని పుట్టినగడ్డకు విచ్చేసిన ఎంపీ రవిచంద్రను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శాలువాతో సత్కరించారు. సమావేశానికి హాజరైన వారికి ఎంపీ వద్దిరాజు బతుకమ్మ,దసరా, దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ,"జై కేసీఆర్ జైజై కేసీఆర్" అంటూ నినాదాలిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, (ఆర్జేసీ), పగడాల నాగరాజు, రాకేష్ రెడ్డి,ఖమర్, నాగచంద్రారెడ్డి, వీరన్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

న్యూస్ ఇండియా తెలుగు సెప్టెంబర్ 25 (జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డి వీరాంజనేయులు)మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల, పట్టణ బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు ముందుండి నిర్వహించగా, సాంప్రదాయ బతుకమ్మ గీతాలు పాడుతూ, పూలతో అల్లిన బతుకమ్మలను నర్తనంతో అలరించారు.

మహిళా నాయకులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలుగు తల్లికి ప్రతీక అని, సాంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఏఎంసి పసుమర్తి శాంత, మాజీ కౌన్సిలర్ కర్నె నాగజ్యోతి, మాడుగుల పూలమ్మ, కల్లూరి కళావతి, కనకపుడి సుచరిత, కొండ్ర సమ్మక్క, మమత నీలమ్మ శ్రీలం అండమ్మ, కేశవ ,సమ్మక్క శ్రీలత,కౌసల్య, నిర్మల, తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం సెప్టెంబర్ 25 న్యూస్ ఇండియా ప్రతినిధి (ఉపేందర్)

జిల్లాలో అనారోగ్యం బారినపడ్డ బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన సుమారు 12 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు విడుదల కాగా వాటిని బుర్హాన్ పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు.ఈ కార్యక్రమం లో ఖమ్మం నగర బీఆర్ఎస్ కార్పొరేటర్లు తోట రామారావు, తోట వీరభద్రం, తెలంగాణ ఉద్యమకారులు పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవు జీవితంలో ప్రమాద భీమా తప్పనిసరి

ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు హరి ప్రసాద్

న్యూస్ ఇండియా:నర్సంపేట: నర్సంపేట అగ్రి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యర్యంలో యూనియన్ సభ్యులుగా ఉన్న 110 మందికి పోస్టలు ప్రమాద భీమా చేపించడం జరిగింది, ప్రమాద భీమా అనేది ప్రతి ఒక్కరి జీవితం లో తప్పక అవసరం అని సంఘ అధ్యక్షులు హరి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, లక్ష్మినారాయణ, శివకుమార్, కోశాధికారి కుమారస్వామి, గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సుభాష్, గౌరవ సలహాదారులు నాగేష్, ఓదెలు,నవీన్, వీరన్న, మహేందర్ రెడ్డి,శ్రీను, మహేందర్, రంజిత్, రాజు,

ఇట్టి కార్యక్రమంకు సహకరించిన పోస్టల్ ఆఫీసర్ ఎస్ లింగమూర్త, రాంబాబు, శ్రవణ్, సాయి కుమార్

ఎస్పీ బాలసుబ్రమణ్యం 5 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...

- డాక్టర్ మద్దాలి మాధవరావు కార్మికులకు,కారు యాజమాన్యానికి పండ్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు..

న్యూస్ ఇండియా ఒంగోలు సెప్టెంబర్ 25:ఎస్పీ బాలు కళాసేవ నేషనల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ మద్దాలి మాధవరావు వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు శ్రీ గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రమణ్యం గారి ఐదవ వర్ధంతి సందర్భంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం గారి విగ్రహానికి గజమాల పూలదండలతో నివాళులర్పించడం జరిగింది.గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రమణ్యం అన్ని భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడి చరిత్ర సృష్టించి చిరస్థాయిగా నిలిచాయి అని ఈ సందర్భంగా తెలియజేశారు.డాక్టర్ మద్దాలి మాధవరావు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు పాడి వారి యొక్క అభిమానాన్ని చాటుకున్నారు. బాలసుబ్రమణ్యం గారి కుటుంబం వేలవేల స్వామి ఆశీస్సులతో ఉండాలని ఈ సందర్భంగా డాక్టర్ మద్దాలి మాధవరావు కొనియాడారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సాహిత్య సేవా సంస్థ కార్యదర్శి సి వి ఎన్ వి ప్రసాద్, ట్రెజరర్ గోనుగుంట సుబ్బారావు కార్మికులు కారు యాజమాన్యం వారు ఎస్పీ బాలసుబ్రమణ్యం సుబ్రహ్మణ్యం గారి విగ్రహానికి ఘన నివాళులు అర్పించి పండ్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.మాధవరావు గారు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు చేయాలని మనసారా గాయనీ గాయకులకు సభాముఖంగా తెలియజేశారు.

భద్రుతండా గ్రామ లంబాడీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

- "అధ్యక్షులుగా అంగోత్ రమేష్ నాయక్"

న్యూస్ ఇండియా: ఖానాపురం :ఖానాపురం మండలంలోని నర్సంపేట నియోజకవర్గం లంబాడి జేఏసీ కన్వీనర్ డాక్టర్ జాటోత్ ఉదయ్ సింగ్ నాయక్ ఆదేశానుసారంగా ఖానాపురం మండల లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్,జాటోత్ సదర్ లాల్,కో కన్వీనర్ తేజవత్ యాకుబ్ నాయక్ ఆధ్వర్యంలో భద్రు తండా గ్రామంలోని లంబాడి జేఏసీ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా అంగోత్ రమేష్ నాయక్ ,కో కన్వీనర్ గా వంకుడోత్ కుమార్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సలహా దారులు జాటోత్ బాలు నాయక్,మండల జాక్ నాయకులు బాధవత్ బాలకిషన్ నాయక్,భూక్య వెంకన్న నాయక్,మూడు బాల కృష్ణ నాయక్,భద్రు తండా లంబాడి జాక్ నూతన కమిటీ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్ నాయక్,కార్యదర్శి మూడు బాల కృష్ణ నాయక్, గుగులోతు లక్ష్మణ్ నాయక్,బానోతు ప్రశాంత్ నాయక్, లావుడ్యా చరణ్ నాయక్,తేజవత్ వంశీ నాయక్,మూడు కళ్యాణ్ నాయక్,గౌరవ అధ్యక్షులు తేజవత్ భద్రు నాయక్,సలహా దారులు వంకుడోత్ రాజు నాయక్, కమిటీ నాయకులు బానోతు వీరన్న నాయక్,మూడు వీరన్న నాయక్,బోడ వెంకన్న నాయక్, బానోతు భీమా నాయక్,ఇస్లావత్ సొమ్లా నాయక్,మాలోత్ ప్రేమ్ కుమార్ నాయక్,ఇస్లావత్ నిజమాల్ నాయక్,అంగోత్ విజేందర్ నాయక్, బానోతు భాస్కర్ నాయక్, గుగులోతు వీరన్న నాయక్,అంగోత్ కిషన్ నాయక్,గుగులోతు వీరన్న నాయక్, తేజవత్ కృష్ణ నాయక్, తేజవత్ వంశీ నాయక్ తండా వాసులు పాల్గొన్నారు.ద

యాదగిరిగుట్టలో దారుణం....

- ముగ్గురు మైనర్ బాలికలపై ముగ్గురు యువకుల అత్యాచారం....
- హైద్రాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో బడి ఎగ్గొట్టి తిరుగుతున్న ముగ్గురు తొమ్మిదో తరగతి బాలికలు...

న్యూస్ ఇండియా తెలుగు సెప్టెంబర్ 26 (తెలంగాణ బ్యూరో రిపోర్టర్ వెంకన్న గౌడ్)బాలికలతో మాటలు కలిపి పరిచయం చేసుకున్న యువకుడు.సదరు యువకుడు మరో ఇద్దరు స్నేహితులను పిలిపించుని బాలికలను పరిచయం చేయించిన వైనం.యాదగిరిగుట్ట దైవ దర్శనం అంటూ ముగ్గురు బాలికలను తీసుకెళ్లిన యువకులు.దర్శనం అనంతరం బాలికలను ఓ లాడ్జీలోకి తీసుకెళ్లిన యువకులు.రాత్రంతా బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టిన యువకులు.అనంతరం బాలికలను హైదరాబాద్ లో ఒదిలి పరారైన యువకులు.పిల్లలు రాత్రంతా ఇంటికి రాకపోవడం తో నిలదీసిన తల్లితండ్రులు.అత్యాచార విషయాన్ని తల్లితండ్రులకు చెప్పిన అమ్మాయిలు.ఘటనపై అల్వాల్ పీఎస్ లో పిర్యాదు చేసిన పేరెంట్స్..ముగ్గురు నిందితులతో పాటు...లాడ్జ్ ఓనర్ ను అదుపులోకి తీసుకున్న అల్వాల్ పోలీసులు.నిందితులపై పోక్సో కేసు నమోదు....

నర్సంపేటలో ఘనంగా గడి మైసమ్మ విగ్రహం ప్రతిష్టపన

న్యూస్ ఇండియా :నర్సంపేట:నర్సంపేట పట్టణంలోని చేర్పాక్రాస్ నందు శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఎదురుగ గడి మైసమ్మ విగ్రహం ప్రతిష్టపన గురువారం రోజు ఉదయం వేద మంత్రలనడుమ డప్పు చప్పులతో వేద పండితులు ఐనవోలు కృష్ణమూర్తిశర్మ చేతుల మీదుగా ప్రతిష్టాపించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా వెలిసిన గడి మైసమ్మ తల్లి మనందరికీ శుభసూచికం అమ్మవారి సన్నిధిలో అన్నిరకాల పూజలు, వివాహాలు,వాహనాల పూజలు జరుపుకోవాలని అన్నారు. విజయదశమి రోజున జమ్మి పూజ, సొరకాయ బలి వంటి కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. తదుపరి గుడి పూజారులు చిలువేరు కొమురయ్య, కోమ్మాలు, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ.. గడి మైసమ్మ ప్రతిష్టాపనకి సహకరించిన అన్ని కులాల బంధువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. గత ఐదు సంవత్సరాల కిందటే విగ్రహప్రతిష్టాపన జరిగేది కరోనా కారణంగా రెండు మూడు సంవత్సరాలు పొడిగించి ఈ ఏడాది తల్లి అనుగ్రహంతో ప్రతి స్థాపించడం జరిగిందని అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని, సిరి సంపదలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. విగ్రహ ప్రతిష్టాపనకు ఎంతో సహకరించిన పాలయి రవికుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తదుపరి పాలయి రవికుమార్ మాట్లాడుతూ... గడి మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేయడం చాలా సంతోషకరమైన విషయం అని కొన్ని సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న మా కల నేడు ఫలించిందని అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు తోడ్పడిన అన్ని కుల పెద్ద మనుషులందరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. తక్కువ సమయంలో వర్షాలను కూడా లెక్కచేయకుండా విగ్రహ ప్రతిష్టాపనకు భారీ ఎత్తున వచ్చిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు అందించారు. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు ఈ ప్రదేశంలోనే నిర్వహించమని ఈ సంవత్సరం అమ్మవారి సమక్షంలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించబోతున్నామని నియోజవర్గం లోని ప్రజలందరూ పాల్గొనాలని తెలియపరిచారు.తదుపరి శివాంజనేయ దేవాలయ వ్యవస్థాపకులు నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం దసరా ఉత్సవలలో చిలువేరు వంశస్థులు కొమురయ్య, కొమ్మలు, కుమారస్వామి,వెంకటేశ్వర్లు, నుండి అఖండ దీపం ఆనవాయిక ప్రకారం విజయదశమి రోజు తీసుకొని వచ్చి గడి మైసమ్మ దేవాలయంలో వెలిగించలని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు ఎర్ర జగన్మోహన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పొలబోయిన మురళిధర్, రెడ్డి సంఘం పెద్దలు, బుర్ర మోహన్ రెడ్డి, ఎర్ర యాకుబ్ రెడ్డి, రెమిడీ శ్రీనివాస్ రెడ్డి,రజక సంఘం పెద్ద మనుషులు, పద్మశాలి సంఘం పెద్ద మనుషులు, గౌడ సంఘం పెద్ద మనుషులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, వాణిజ్య వ్యాపారవేత్తలు తోట అశోక్, గణపురం సురేష్,పబ్బ శ్యామ్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ విఫలం!

విధుల్లో చేరినప్పుడు చేసిన హెచ్చరికలకు తిలోదకాలు!

సంగారెడ్డి జిల్లా, బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 25, న్యూస్ ఇండియా : పిఆర్జిఐ, అర్ఎన్ఐ దరఖాస్తులను పరిశీలించి ముందుకు తీసుకోపోవడంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పూర్తిగా విఫలం చెందారు. భారతదేశంలో క్రొత్తగా వార్త పత్రికల రిజిస్ట్రేషన్ నమోదు చేయడానికి ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ అఫ్ ఇండియా (పిఆర్జిఐ), రిజిస్ట్రార్ అఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా (అర్ఎన్ ఐ) అని పిలువబడే ప్రభుత్వ సంస్థ లో రిజిస్ట్రేషన్ కొరకై నమోదు చేసుకోవలసి ఉంటుంది. సంబంధిత దరఖాస్తుదారుల దరఖాస్తులను తరువాతి ప్రక్రియ కొరకై ముందుకు తీసుకుని వెళ్లడానికి కేవలం జిల్లా కలెక్టర్ కు మాత్రమే లాగిన్ యాక్సెస్ అర్హత కలిగి వుంటారు. సంబంధిత 'సి' సెక్షన్ ఉద్యోగులు గందరగోళ పరిస్థితులలో వున్నారు. ఏదేమైనప్పటికీ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నప్పుడు జిల్లా యంత్రాగాన్ని విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని చక్కటి సూచనలతో పాటు హెచ్చరికలు కూడా చేశారు. జిల్లా యంత్రాంగం మాత్రం జిల్లా కలెక్టర్ హెచ్చరికలు

ఏమాత్రం పట్టించుకోలేదు అనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ప్రజల 'దరఖాస్తుల పట్ల చిత్తశుద్ధి చూపించకపోవడం' అనే జబ్బు ఈ శాఖతో సహా ఇతర శాఖలలో కూడా కొనసాగుతున్న విషయాన్నీ కలెక్టర్ దృష్టికి రాకపోవడం ప్రజలు చేసుకున్న దురదృష్టంగా భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గా విధుల్లో చేరినప్పుడు ప్రభుత్వ అధికారుల పట్ల చేసిన హెచ్చరికలకు తిలోదకాలు పలికిన పరిస్థితులు స్పష్టమవుతున్నాయి.

ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలి,..

రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

న్యూస్ ఇండియా, ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 25,ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక గణేష్ బతకన్న నాగన్న ఆధ్వర్యంలో స్వామి దాసు ఉదయ్ ఖాజా రఘు రవి జయన్న హనీఫా శామ్సన్ పాల్గొని ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సోమప్ప సర్కిల్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన,అనంతరం తహశీల్దార్ శేషఫణి కి వినతి పత్రం అందజేశారు. ఐక్యవేదిక నాయకులు గణేష్,బతకన్న, నాగన్న మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాలులో సమన్యాయం జరగాలంటే తప్పనిసరిగా ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా కరువు, వలసలు తగ్గాలంటే ఆదోని జిల్లాతోనే సాధ్యమని వారన్నారు కర్నూల్ పశ్చిమ ప్రాంతం ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని,పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో విద్య, వైద్యంలో ఆదోని ప్రాంతం వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని జిల్లాతో కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించబడి అభివృద్ధి వికేంద్రీకరణకు ఆస్కారం ఉంటుందని న్నారు.

పాలకుర్తి రైతుల పంటల రక్షణకు చర్యలు అవసరం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదాపూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

న్యూస్ ఇండియా తెలుగు సెప్టెంబర్ 26 (తెలంగాణ బ్యూరో రిపోర్టర్ వెంకన్న గౌడ్)హైదరాబాద్ పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ %-% పాలకుర్తి నియోజకవర్గంలో వర్షపాతం ఉన్నప్పటికీ చెక్‌డ్యామ్‌లు నిండకపోవడం వలన రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జనగామ జిల్లా, కొడకండ్ల మండలంలోని హాట్యా తండాలోని కాకతీయ కెనాల్ వద్ద స్లూయిస్ గేట్ (%ూ%) ఏర్పాటు చేసి నీటిని మళ్లించాలని మంత్రి గారిని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కోరారు.ఈ %ూ% ఏర్పాటుతో పాలకుర్తి నియోజకవర్గంలోని పోచారం, బొమ్మకల్, కర్కాల, చికటాయపాలెం గ్రామాల్లో ఉన్న చెక్‌డ్యామ్‌లు నిండిపోతాయని, ఫలితంగా రైతుల పంటలు రక్షించబడతాయని ఎమ్మెల్యే వివరించారు. చెక్‌డ్యామ్‌లు నిండితే సాగునీరు లభించి, రైతుల ఆర్థిక పరిస్థితి దృఢపడుతుందని వారు అన్నారు.రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈ ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి హామీ ఇచ్చారు..

కూకట్ పల్లి సిద్ధార్థ కళాశాలలో

ఘనంగా బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు కూకట్ పల్లి సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఘనంగా జరిగాయి. ఫ్యాకల్టీ, స్టూడెంట్స్?తో కలిసి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. చిత్తూ చిత్తూల బొమ్మ..శివుడీ ముద్దుల గుమ్మా' అంటూ విద్యార్థినులు ఆడిపాడారు. ఈ వేడుకల్లో కళాశాల ఛైర్మన్ జి. నాగయ్య, అధ్యక్షుడు జి. భాస్కర్ రావు, డైరెక్టర్లు మధుసూదన్ రావు, అరవింద్ రావు, ప్రిన్సిపల్స్ పద్మప్రియ, చంద్రశేఖర్ తోపాటు లెక్చరర్లు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ!

పరమాత్మతోనే కాదు ప్రకృతితోనూ మన అనుబంధాన్ని స్ఫురణకు తెచ్చే వేడుక బతుకమ్మ పండుగ. బతుకమ్మ శోభ తెలుగునేల సంస్కృతి సంప్రదాయాలను పరిమళింపజేస్తుంది. ఆదిపరాశక్తిని పూల రూపంలో పూజించే పండుగ ఇది. జానపదులు తమ గుండెల్లో కొలువైన గ్రామదేవతలను ఆవిష్కరిస్తారు. పాటల రూపంలో వారిపై తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు.

స్త్రీల అస్తిత్వానికి అద్దంపట్టే బతుకమ్మపండుగలో మహిళల మనోభావాలు, కళలు ఆవిష్కృతమవుతాయి. తెలంగాణ ఘనమైన సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ నేడు ప్రపంచమంతా విస్తరించింది. బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవి అంశగా, శ్రీచక్రశోభితగా, తమ ఇంటి ముత్తయిదువగా భావించి ఆరాధిస్తారు. ఈ పండుగను సామూహిక శక్తి ఉపాసనగా అభివర్ణిస్తారు. రంగురంగుల పూలను శ్రీచక్ర మేరు ఆకారంలో పేర్చి తీర్చిదిద్దుతారు. ఇది స్త్రీల సృజనాత్మకతకు ప్రతీక. తంగేడు, బంతి, గునుగు, గుమ్మడి, మల్లె, మంకెన, బంతి, కనకాంబరం, గన్నేరు.. ఇలా ఎన్నెన్నో పూలు బతుకమ్మ అమరికలో ఒదిగి పులకించిపోతాయి.

పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు.

దేవనకొండ సెప్టెంబర్ 25 న్యూస్ ఇండియా ప్రతినిధి: మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామంలో వ్యవసాయ అధికారులు ఏరువాక కేంద్రం సైంటిస్ట్ సుజాత, మండల వ్యవసాయ అధికారి ఉషారాణి పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంట ఆకుల ఎర్రగా కావడం వలన దాని నివారణకు పొటాషియం నైట్రేట్ 10 గ్రామాలు లీటర్ వాటర్ కి కలుపుకొని వారానికి ఒకసారి పిచికారి చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు సైఫార్ మిత్రిన్ 2 ఎంఎల్ లామ్డా సైహలోత్రిన్ ఎంఎల్ లీటర్ వాటర్ కి కలుపుకొని పిచికారి చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.

వాహనమిత్ర దరఖాస్తు గడువు పొడిగించాలి.

ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఏం. నరసరావు.

దేవనకొండ సెప్టెంబర్ 25 న్యూస్ ఇండియా ప్రతినిధి: ఆటో కార్మికులకు వర్తింపజేసే వాహన మిత్ర దరఖాస్తు గడువు తేదీని పొడగించాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఏం. నరసరావు, డిమాండ్ చేశారు. ఆటో కార్మికులతో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల వ్యాప్తంగా ఆటో, రవాణా రంగంపై ఆధారపడి బ్రతుకుతున్న లక్షలాదిమంది ఆటో కార్మికుల జీవితాలు అగమ్య గోచర స్థితిలో ఉన్నాయన్నారు. ఆటో కార్మికుల జీవనం దుర్భరమైన స్థితిలో ఉన్నదన్నారు. ఇప్పటివరకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా ఆటో కార్మికులు ఎలాంటి భద్రత లేని జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతినెలా ఆటో కార్మికులకు జీవన భృతి కింద 5,000 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినెలా ఆటో కార్మికులకు జీవన భృతి కింద 5,000 రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, ఆటో కార్మికులు రాజన్న, మల్లికార్జున,వెంకటేష్, ప్రభు దాస్, చాంద్, రాజు, నరేష్ , రవి, తిక్కయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలు - నాలుగో రోజు వాసవి మాతకు శ్రీ కాత్యాయనీ దేవి అలంకారం.

జంగారెడ్డిగూడెం సెప్టెంబర్ 25 న్యూస్ ఇండియా ప్రతినిధి

జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నాలుగో రోజు అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా ప్రధాన పూజా కార్యక్రమాలలో వందనపు వెంకట నరసయ్య – నాగమణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి అలంకరణకు, భక్తులకు పంపిణీ చేసిన ప్రసాదాల ఏర్పాటుకు శ్రీనివాస షాపింగ్ మాల్ వారు ఆర్థికంగా సహకరించారు.

ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ టి.వి.ఏ. రామతారకం మాట్లాడుతూ, దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో 108 మంది మహిళా భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడికిమళ్ళ శివ రామ కృష్ణ, కాటేపల్లి రుద్రయ్య, కేసనపల్లి వంశీ, పమిడి శ్రీకాంత్, తిరువీధి హనుమంతరావు, కంపతి శ్రీనివాస్ రావు, అత్యం వెంకటేశ్వరరావు, జల్లిపల్లి దుర్గ ప్రసాద్, ప్రతి సుబ్బారావు, జల్లిపల్లి మూర్తి, మోతుకూరి సత్యనారాయణ, కర్పూరం సాయి, ఏలూరు ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలంలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమాలు

న్యూస్ఇండియా, రిపోర్టర్ నవకుమార్, వెలిగండ్ల మండలం, సెప్టెంబర్ 25: స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమం భాగంగా మండలంలోని మరపగుంట్ల పంచాయతీలో, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం పరిసరాలు, గ్రామ వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా, టిడిపి మండల అధ్యక్షుడు ఇంద్రభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, శుభ్రత వలన ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సూచించారు. తరువాత మండల కేంద్రం వెలిగండ్ల పంచాయతీలో ప్రత్యేక శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ చౌడారెడ్డి, మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా ద్వారా తీసిన కొత్త వైన్ షాప్స్ టెండర్స్

న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 25(మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్)తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కొత్త వైన్ షాప్స్ టెండర్స్ 2025-27 కు సంబంధించిన మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ కు సంబంధించిన 118 దుకాణాలకు గాను 101 దుకాణాలను ఓపెన్ కేటగిరీ కి, 11 గౌడ కులస్తులకు , 5 షెడ్యూల్డ్ కులాలకు మరియు 1 షెడ్యూల్డ్ తెగలకు , అదేవిధంగా మల్కాజిగిరి యూనిట్ కు సంబంధించిన 88 దుకాణాలకు గాను 68 దుకాణాలను ఓపెన్ కేటగిరీ కు, 12 గౌడ కులస్తులుకు, 7 షెడ్యూల్ కులాలకు, 1 షెడ్యూల్ తెగలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో తీసిన డ్రా ద్వారా కేటాయించడం జరిగింది.. ఈ కార్యక్రమము లో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ మరియు మేడ్చల్, మల్కాజిగిరి యూనిట్ ల జిల్లా ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు

జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పరిహారం పంపిణీని వేగవంతం చేయాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 25 (మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నరేష్)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మను చౌదరి సూచించారు. గురువారం కలెక్టరేట్ విసి హాలులో జాతీయ రహదారుల నిర్మాణాల పై నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి రోడ్డు విస్తరణ పై ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన కోర్టు కేసులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రోడ్డు విస్తరణకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి ప్రతి కేసు పూర్వపరాలు తెలుసుకొని, తీసుకోవలసిన చర్యల పై అధికారులకు అవసరమైన సలహాలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఎస్డిసిఎల్ సూపరింటెండెంట్ మాలతి, ఎన్ హెచ్ ఎ పిడి శ్రీనివాసరావు, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, తదితరులు పాల్గొన్నారు.